


పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రోజురోజుకు ఉష్ణోగ్రతలు క్రమ క్రమంగా పెరుగుతూ ఉండటంతో ప్రజలు విలవిలాడుతున్నారు. గురువారం 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉదయం 10 గంటల నుంచి ఉక్కపోత మొదలవుతోంది. దీంతో మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటల వరకు వాతావరణం వేడిగా ఉంటోంది. అధికంగా మంచినీరు తాగడం, ఒఆర్ఎస్ ద్రావణం తాగడం, కొబ్బరి నీళ్లు మజ్జిగ వంటివి అధికంగా తీసుకోవడం వల్ల వేసవి నుంచి ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు.


నిర్మానుష్యంగా రోడ్డు

సాగునీరందక రైతుల అవస్థ

- ఎత్తిపోతల పథకం కార్యాచరణ ఎప్పటికో
- పాలకులు చర్యలు చేపట్టాలని కోరుతున్న రైతులు

ప్రజాశక్తి - మామిడికుదురు

చుట్టూ జీవజలాలు ఉన్నా అవి సముద్రం పోటు ప్రభావముతో నిత్యము ఉప్పునీటిగా మారడం వల్ల సాగుకు ఉపయోగపడటం లేదు. వైనతేయ గోదావరి తీరంలోని కుడి కరకట్టకు దిగువన ఉన్న నాలుగు లంక గ్రామాలకు దశాబ్దాల తరబడి సాగునీటి వసతి సదుపాయం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు భూగర్భ జలాలు అడుగంటి పోవడం, ఉప్పునీటి మయంగా మారడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి లంక గ్రామాలకు పంట కాలువ ద్వారా 4,200 ఎకరాల భూములకు నీటిని అందించేందుకు ఉద్దేశించిన అప్పనపల్లి ఎత్తిపోతల పథకం దశాబ్దాల తరబడి సాకారానికి నోచుకోవడం లేదు. పాలకులు, పార్టీలు మారుతున్న వారు హామీలు ఇస్తున్నారే! తప్ప కార్యాచరణ పై దృష్టి సారించడం లేదని రైతులు వాపోతున్నారు ఇది ఎప్పటికి ఆచరణలోకి వస్తుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు ఒకప్పుడు భూగర్భ జలాలతో అంతర పంటలు పండిస్తూ ఎందరో జీవనోపాధి పొందేవారు. సాగునీటి వసతి కరువవడంతో వారంతా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి ఒకప్పుడు ఉద్యాన పంటలతో కళకళలాడాలిన కొబ్బరి తోటలు నేడు వెలవెల పోతున్నాయి


లంక గ్రామాలకు సాగు నీటి అవస్థలు

ప్రతిపాదనలకే పరిమితము కార్యాచరణ ఎప్పటికో

మామిడి కుదురు మండలంలోని అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం, పెదపట్నం గ్రామాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని గతంలో పలుసార్లు సర్వేలు, ప్రతిపాదనలు చేసిన ఏ ఒక్కటి కార్యాచరణకు నోచుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీంతో సారవంతమైన లంక భూములుపలు చోట్ల బీడు భూములుగా మారుతున్నాయి. మొండేపులంక తూర్పు చానల్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా 4,200 ఎకరాలకు సాగునీటి వసతి కల్పించేందుకు 2005 లో ప్రతిపాదనలు రూపొందించి నేటికీ కొలిక్కి రాలేదు దీనికి రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ ఇంజినీరింగ్ అధికారులు అప్పట్లో రూ.30 కోట్లు వ్యయమవుతుందని ప్రతిపాదనలు రూపొందించారు ఈ పథకం 20 ఏళ్ల తర్వాత రూ.60 కోట్లకు చేరింది దీనికి అనుమతులు రావడంతో నెలకొన్న తీవ్ర జాప్యంతో పథకం కాస్త నీరుగారిపోయింది. నాలుగు లంక గ్రామాల ప్రజలు కు ఇరిగేషన్ సదుపాయం కల్పిస్తామని కూటమి ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం లో హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఎంఎల్ఎ స్పందించి దీర్ఘకాల సమస్య అయిన ఎత్తిపోతల పథకం సాకారమయ్యే లా దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతలపై పాలకులు స్పందించాలి



ప్రతిపాదనలకే పరిమితమైన ఎత్తిపోతల పథకం పై అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కార్యాచరణకు నోచుకునేలా చూడాలి. ఎత్తిపోతల పథకం కార్యాచరణకు నోచుకుంటే పలు రకాల ఉద్యాన పంటలతో లంక భూములన్నీ కళకళలాడతాయి. స్థానికంగా ఉన్న రైతులకు వ్యవసాయ కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది

-చెల్లుబోయినశివ రామ సుబ్రహ్మణ్యం, సర్పెంచ్, బి. దొడ్డవరం

సాగునీటి వసతి కల్పించాలి



ఎత్తిపోతల పథకం సహకారం అయితే రైతులందరిలో ఆనందం వెల్లి విరుస్తుంది. భూములు సాగులోకి రావడం వల్ల అటు రైతులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పోయిన వారు తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటారు. ఎంతో ప్రయోజనం పొందుతారు ప్రభుత్వము దీనిపై దృష్టి పెట్టి పథకం కార్యాచరణకు నోచుకునేలా చర్యలు చేపట్టాలి

- బండారు సత్తిబాబు, రైతు, పెదపట్నం లంక

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రస్తుత రబీ సీజన్లో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని వ్యవసాయ పౌర సరఫరాల అధికారులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు వ్యవసాయ, సివిల్ సప్లయిస్ అధికారులను మిల్లర్లు, మార్కెటింగ్ తూనికలు కొలతలు జిల్లా సహకార సంస్థ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి ధాన్యం సేకరణ కొనుగోలు అంశాలపై సమీక్షించారు . ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ధాన్యం సేకరణకు సంబంధించి ధాన్యం తేమ శాతం 17 శాతం వున్నా రైతుల నుంచి ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటాలు రూ.2,320కు, 75 కేజీలు రూ.1,740కు కొనుగోలు చేయాలని, కామన్ వెరైటీ క్వింటాలు రూ.2,300కు 75 కేజీలు రూ.1,725కు కొనుగోలు చేయాలని కలెక్టర్ మిల్లర్లను ఆదేశించారు. ప్రస్తుత రబీ సీజన్లో 1,64,854 ఎకరాలలో సాగు విస్తీర్ణం నుండి దిగుబడి సుమారు గా 5,86,616 మెట్రిక్ టన్నులు ఉందని అయితే ప్రభుత్వం మొదటి దశలో 34 శాతం అనగా 2 లక్షల మెట్రిక్ టన్నులనే కొను గోలుకు లక్ష్యంగా నిర్దే శించిందన్నారు. రాష్ట్ర స్థాయిలో మంత్రులు సంప్రదింపులు జరిపి లక్ష్యాలను పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బహిరంగ మార్కెట్లో కూడా కనీస గిట్టుబాటు ధరలు కల్పిస్తూ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కేలా రైతు సేవా కేంద్ర ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దళారులకు, మధ్య వర్తులకు ధాన్యం అమ్మి రైతులు నష్టపోవద్దని జెసి టి.నిశాంతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, డిఎస్‌ఒ అడపా ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, డిసిఒ మురళీకృష్ణ, మార్కెటింగ్ ఎడి విశాలాక్షి, తూనికలు కొలతలు కంట్రోలర్ రాజేష్, మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్లు లక్ష్మీనారాయణ, చౌదరి, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

సమ్మర్ క్యాంప్ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - అమలాపురం

యువతలో క్రీడా ప్రోత్సాహం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు కెఎస్‌బిఎ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమని అమలాపురం రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్ అన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో ఉచిత సమ్మర్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్‌ను సిఐ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాంప్‌లో పాల్గొనే ప్రతీ ఆటగాడు బ్యాడ్మింటన్ క్రీడలో ప్రావీణ్యం సాధించి, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపే అవకాశాలు అందుకుంటారని ఆకాంక్షించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 100కి పైగా యువ ఆటగాళ్లు పాల్గొంటారని అనుభవజ్ఞులైన కోచ్‌ల నుంచి శిక్షణ ఇప్పిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు సాత్విక సాయిరాజ్, కెఎస్‌బిఎ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రంకిరెడ్డి రంగ మణి, జాయింట్ సెక్రటరీ కల్వకొలను బాబు తదితరులు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ సమ్మర్ కోచ్ ప్రారంభిస్తున్న సిఐ ప్రశాంత్

నేడు 'గురుకుల' ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నటు జిల్లా డిఆర్ఒ బిఎల్ఎన్.రాజకుమారి వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని డిఆంఒ ఛాంబర్ నందు కాకి నాడ జిల్లా తుని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హేమలత, పరీక్షా కేంద్రాల ముఖ్య పర్య వేక్షకులు లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఈనెల 25న శుక్రవారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షల సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలు, ఎపిఆర్ జెసి, ఎపిఆర్‌డిసి సెట్-2025 ప్రవేశ పరీక్షలు నిర్వహణకై జిల్లాలో అమలాపురం నందు రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు బ్యాక్ లాక్ కు సంబంధించి 40 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు కానున్నట్టు తెలిపారు. ఎపి రెసిడెన్షియల్, జూనియర్ కాలేజ్ రెసిడెన్షి యల్ డిగ్రీ కళాశాల్లో ప్రవేశాల కొరకు ప్రవేశ పరీక్ష రాసేందుకు జిల్లా వ్యాప్తంగా 285 మంది హాజరు కానున్నారన్నారు. వీరి కొరకు జడ్‌పి బాలికల ఉన్నత పాఠ శాల అమలాపురం, మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ వి.అగ్రహారం నందు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారన్నారు. గురుకు లాలలో 5,6,7,8 ప్రవేశ పరీక్ష ఈనెల 25న శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారన్నారు.అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యంగా హాజరైనప్పటికీ అనుమతిం చాలన్నారు. ఎపి రెసిడెన్షియల్ , జూనియర్ కాలేజీ ప్రవేశాలు, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కొరకు ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారరు. ఈ యొక్క ప్రవేశ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. రెండు పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రాథ మిక చికిత్స వైద్య శిబిరం వంటి కనీస వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం లో ప్రవేశ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బి.హను మంతరావు, చీఫ్ సూపరింటెండెంట్‌లు జి.నాగసుబ్బారావు, వి.విజయకుమారి, ట్రాన్స్‌కో ఎఇ ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలతో అలంకరించారు. గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో పనిచేయుచున్న పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అనంతరం త ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నకుమారి, మండల పరిషత్ ఎఒ జి. రాజేంద్రప్రసాద్, ఎంఇఒ కె.తాతారావు హౌసింగ్ ఎఇ కె.శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి ఆర్‌ఎమ్‌వివిఎన్.ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్, వీరభద్రరాజు తదితరులు పాల్గొన్నారు. **అల్లవరం:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు మండల అభివృద్ధి అధికారి బి. కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు యిళ్ళ శేషగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఇఒపిఆర్‌డి, నాగేంద్ర, మండల పరిషత్ ఎఒ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షులు పి. బంగార్రాజు, జెడ్‌పిటిసి. సభ్యులు బోణం సాయిబాబా, ఎంపిటిసి సభ్యులు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి చంద్ర శేఖర్ పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** బండారులంక గ్రామపంచాయతీ లో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇఒపిఆర్‌డి మంగాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలో జరుగు అభివృద్ధి పనుల గురించి చర్చించారు.కార్యక్రమంలో సెక్రెటరీ కె.శ్రీనివాస్, గుమస్తా రాజు, సచివాలయం సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** మండలం పినపళ్ల గ్రామపంచాయతీకి రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు దక్కింది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అమరావతిలో గురువారం ఈ అవార్డు అందించారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో పినపళ్లకు ఈ అవార్డు దక్కింది. పంచాయతీ రాజ్ రూరల్, డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశి భూషణ కుమార్ , పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ ల చేతుల మీదుగా సర్పంచ్ సుభాష్ తో పాటు గ్రామ కార్యదర్శి షణ్ముఖ వీర్రాజు ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావుకు, కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావుకు, ఆలమూరు ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజుకు, ఇతర అధికారులకు తదితరులకు సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు. **ఉప్పలగుప్తం:** మండలంలోని ఆయా గ్రామాలలోని పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్ ల అధ్యక్షతన గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విలసవిల్లిలో సర్పంచ్ సలాది ఊర్మిళదేవి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ ప్రముఖ పాత్ర వహిస్తుందని అన్నారు. ఉప్పలగుప్తం మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ వాకపల్లి ఈశ్వరి అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఈశ్వరి పుట్టినరోజు కావడంతో సర్పంచ్ ఈశ్వరి కి గ్రామ పెద్దలు ఆకుల రాము, ఆకుల బుజ్జి, పండు వెంకటేశ్వరరావు, కాట్రు కృష్ణ, ఊటాల రామాంజనేయులు, ఆకుల చిన్ని, ఆకుల సత్యనారాయణ, ఆకుల ఏడుకొండలు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. **మామిడికుదురు:** మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన, బి.దొడ్డవరం పంచాయతీ కార్యాలయము వద్ద సర్పంచ్ చెల్లిబోయిన శివరామ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన, మామిడికుదురులో పంచాయితీ కార్యదర్శి అధ్యక్షతనజాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలలో ఎఒ కారుపల్లి వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, ఎంఇఒ లక్ష్మీనారాయణ, బి.దొడ్డవరం ఎంపిటిసి వాసంశెట్టి వెంకటరమణ, మండల పరిషత్తు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఇ.మహేశ్వరావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఆర్. నాగకుమార్, బి.శ్రీనివాస రాజు, ఎపిడి జి.మల్లికార్జున రావు, ఎపిఒ కవిత, మండల పరిషత్ ఎఒ మంగతాయారు, ఇఒపిఆర్‌డి గంగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** మండలంలోని అనాతవరం పంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సర్పంచ్ మిమ్మితి చిరంజివి అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ముమ్మిడివరం ఎంపిడిఒ టిఎస్.వెంకటాచార్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి సురేష్, పంచాయతీ సచివాలయం సిబ్బంది, కురసాల శివ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం మండలపరిషత్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానం


రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న పినపళ్ల సర్పంచ్ సుభాష్


అమలాపురం మండలం బండారులంక గ్రామ సభలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి


ముమ్మిడివరం మండలం అనాతవరంలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఎంపిడిఒ


మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం


రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కార్టూ'నిజం'



10 ఫలితాల్లో వెనకబాటు

గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదాం...

ప్రజాశక్తి, -ఉప్పలగుప్తం

చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా పడవేయకుండా గ్రామాన్ని శుభ్రంగా ఉంచుదామని సర్పంచ్ జొన్నాడ శ్రీ దుర్గ సూచించారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధిలోని సుమారు 1100 కుటుంబాలు గ్రామ పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నారు.ఆ కుటుంబాలకు గురువారం సర్పంచ్ శ్రీదుర్గ తడి పొడి చెత్త వేసేందుకు ప్లాస్టిక్ టబ్ లను అందజేశారు. ఇంటిలోని తడి పొడి చెత్తను వేరువేరుగా వేసుకునేందుకు టబ్‌లను వినియోగించుకోవాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, పంచాయతీ వార్డు సభ్యులు పరమట సత్యనారాయణ, వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని,పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ షెహన్‌షా, విఆర్ ఒ వి.ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళలకు ప్లాస్టిక్ టబ్‌లు అందజేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉగ్రదాడిలో మృతులకు సంతాపం

ప్రజాశక్తి - యంత్రాంగం


జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై డాడిలో మృతులకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జిల్లాలో పలుచోట్ల కూటమి నాయకులు గురువారం సంతాపం తెలిపారు. **కొత్తపేట:** పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి వాడపాలెం కార్యాలయం వద్ద కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సంతాప సభ నిర్వహించారు. అలాగే మృతుల కుటుంబ సభ్యులకు ఎంఎల్ఎ సత్యానందరావు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బూసి విజయలక్ష్మి , మాజీ సర్పంచ్ బండారు బుల్లి తాత, విళ్ళ మారుతి ప్రసాద్, ఎన్‌డిఎ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆలమూరు:** కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా మండలంలోని పెదపళ్లలో గురువారం రాత్రి అఖిలపక్ష నాయకుల అధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉగ్రవాదులు చేతుల్లో మృతి చెందిన మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ చౌదరి, నామాల రుద్రయ్య చౌదరి, జాస్తి భాస్కర రావు, గొడవర్తి రాంబాబు, వట్టికూట్టి గణేశ్వరరావు, మైలవరపు బాబి, బొబ్బా భాస్కర రావు, గొడవర్తి సురేష్, మహిళలు పాల్గొన్నారు.



వాడపాలెంలో సంతాప సభలో పాల్గొన్న ఎంఎల్ఎ సత్యానందరావు

పహల్గావ్ ఘాతుకం దుర్మార్గం

మండపేట: ఒక మనిషిని హత్య చేస్తే సర్వ మానవాళిని హత్య చేసినట్లేనని ఖురాన్ చెబుతుందని, నిజమైన ముస్లిం ఎప్పుడూ పహల్గావ్ వంటి ఘాతుకానికి పాల్పడరని టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ అన్నారు. మండపేటలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ఇస్లాం ఎంత మాత్రం సమర్థించదన్నారు. జరిగిన ఘటనను ఇస్లాం ముక్త కంఠంతో ఖండిస్తుందన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారికి దేశ రక్షణ వ్యవస్థ తగిన బుద్ధి చెబుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశ సమగ్రతకు, రక్షణకు ఎటువంటి త్యాగానికైనా ముస్లిములు సిద్ధంగా ఉంటారన్నారు. పహల్గావ్ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.


ఉపాధి పనుల మస్తర్ తనిఖీ చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు గత మూడు వారాలుగా జరుగుతున్నాయి. సుమారు 428 మంది కూలీలు పంట బోదెల పూడికతీత, కొబ్బరి చెట్లకు పళ్ళాలు కొట్టడం వంటి పనులు చేస్తున్నారు. గురువారం కూలీలు చేస్తున్న ఉపాధి పనులను స్థానిక సర్పంచ్, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు పరిశీలించారు. ఉపాధి కూలీలకు ఆయన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే మస్తర్లను తనిఖీ చేసిన సర్పంచ్ చిన్నవరాజు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కడిమి అరుణ కుమారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు ఉన్నారు.

రైతుల కష్టం.. దళారుల పాలు

- ప్రభుత్వ ధర రూ.1,740
- దళారుల ధర రూ.1450
- కాన రాని కొనుగోలు కేంద్రాలపై రైతుల ఆగ్రహం
- ఎక్కడ ధాన్యం అక్కడే


మెయిన్ రోడ్డుపై అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం రాశులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రైతుల కష్టం దళారుల పాలవుతోంది. రైతులు రాత్రి పగలు కష్టించి పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర లభించకపోవడంతో ఇదే అదును గా దళారులు అయినకాడికి కొని లాభాలు పొందుతున్నారు. దాళ్వా సీజన్‌లో ప్రభుత్వ ధర క్వింటాల్ కు రూ.1740 లు ప్రకటించగా కొనుగోలుదారులు రూ.1450 నుంచి రూ.1500 మాత్రమే చెల్లించడంతో రైతులకు రూ. 200 వందల నుంచి రూ.3 వందల వరకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు ధాన్యం కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో రైతులు పండించిన పంటను దాచుకోలేక అయిన కాడికి అమ్ముకుంటున్నారు. ఈ వారంలో ఇప్పటికే అల్పపీడనం ద్రోణి వర్షంతో రైతన్నలు పండించిన పంటను వెంటనే అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే తేమ అధికంగా ఉన్న పంటను రైతులు అమ్ముతున్నారన్న విషయం తెలుసుకున్న దళారులు తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కేవలం రూ.1250 లకు కొనుగోలు చేస్తున్నారు. దాల్వాకు అధిక పెట్టుబడులు పెట్టిన రైతులు తమ ధాన్యాన్ని అమ్మేసినా కనీస మద్దతు ధర లభించకపోవడంతో పాటు కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వ్యవసాయ అధికారులు ప్రకటనలన్నీ పత్రికల మాత్రమే పరిమితం అవుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేగంగా హార్వెస్టర్ల సహాయంతో కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం అమ్మేందుకు ఎదురుచూస్తున్నారు. మెయిన్ రోడ్డు కొంత రోడ్డు ఎక్కడ చూసినా రోడ్లపైనే ధాన్యం దర్శన మిస్తుంది. ఎక్కడికక్కడ పేరుకుపోతున్న ధాన్యం రాశులను చూసి వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం ప్రకటించిన సివిల్ ధర రైతులకు అందేలాగా చర్యలు తీసుకోవాలని, అధికారులు రైతు భరోసా కేంద్రాలను సొసైటీలను కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతులు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనికి దళారులు కృష్ణ చేసుకుంటున్నారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం వద్ద సరైన విధానాలు లేవు. దళారులు ధాన్యం కొనుగోలు ఒక జట్టును ధాన్యం మిషన్, తూకం యంత్రాలు తీసుకుని తిరుగుతూ ఉంటారు. రైతు భరోసా కేంద్రాలకు జట్టు కూలీలు లేకపోవడంతో, ధాన్యం కొనుగోలుకు కష్టమవుతుండటం దీనిపై అధికారులు సరైన ఆలోచన చేసి సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మద్దతు ధర అందేలా చర్యలు చేపట్టాలి

ప్రభుత్వం ప్రకటించిన సివిల్ ధర రైతులకు అందేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం అధికారులు రైతు సేవా కేంద్రాలు, సొసైటీల వద్ద ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో రైతులకు రూ.1450 మాత్రమే లభిస్తుందని సుమారు రూ.300 వరకు రైతు లు నష్టపోతున్నారు. దళారులు దోపిడీ అరికట్టి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలి.

-సాపిరెడ్డి శ్రీనివాస్, రైతు, ఎర్ర పోతవరం

కొనుగోలు కేంద్రాలకు వచ్చి సమాచారం చెప్పాలి

ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధం చేసు కున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో శాంపిల్ తీసుకువచ్చి సమాచారం ఇవ్వాలి. ఈ సంవత్సరం 52 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశాం. కొను గోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయని, ఇప్పటివరకు 305 టన్నుల కొనుగోలు చేశాం. రైతులు వస్తే మా స్టాఫ్ ఫీల్డ్ కి వెళ్లి శాంపిల్ తీసుకుని సంచులు అందజేస్తారని ఏవో తెలియజేశారు.

-బలుసు రవి, మండల వ్యవసాయ అధికారి

నేరాలు ఘోరాలు

ఏలేరులో స్నానానికి దిగి అమ్మమ్మ, మనవడు మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారి సమీపాన ఏలేరు నదిలో స్నానానికి దిగి అమ్మమ్మ మనవడు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ ఎస్ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడుకు చెందిన అరటికోట్ల సత్యవతి (52) తన కూతురి కొడుకు గోర్ల వీర మనోజ్ (12)ను తీసుకుని బుధవారం సాయంత్రం ఏలేరు కాలువలో స్నానానికి దిగింది. ఊపిరాడక పోవడంతో ఇద్దరూ మునిగి చనిపోయారు. గురువారం సత్యవతి మృతదేహం నీటిలో తేలింది. స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ గట్టుపై ఇద్దరి చెప్పులు ఉండడంతో అనుమానం వచ్చి గాలింపు చర్యలు చేపట్టగా మనోజ్ మృతదేహం లభించింది. వీరి ఇంటి సమీపంలో ఉన్న గ్రామ దేవత ఉత్సవాలు ఉండడంతో పవిత్ర స్నానం చేసేందుకు ఏలేరు కాలువలో స్నానానికి వచ్చినట్టు కుమార్తె రమణమ్మ, అల్లుడు రాజు తెలిపారు. మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలో సముద్రతీర మత్స్యకార గ్రామమైన పల్లంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగడంతో నలుగురికి గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్లం గ్రామ పంచాయతీ పరిధిలోని కుతుబాలు దగ్గర నీళ్లు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళల పట్ల ఒకరిపై ఒకరు దూషించు కున్నారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటు చేసుకుం ది. ఈ ఘర్షణలో మల్లాడి చిన్నవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్, మల్లాడి ధర్మారావు, మల్లాడి దమయంతిలు గాయపడ్డారు. క్షతగాత్రులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌కు దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - చాగల్లు

నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన దింపు కార్మికుడు కోలా ధనరాజు(22) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. చిక్కాల గ్రామ శివారులో ఉన్న కొబ్బరి తోటలో కొబ్బరికాయలు దించేందుకు గురువారం వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కొబ్బరి కాయలు దింపుతున్నాడు. కొబ్బరి ఆకు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ధనరాజు సోదరుడు కోలా శివ ఫిర్యాదు మేరకు చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శివారు మీనా నగరంలో నిర్వహి స్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 8 మందిని అరెస్టు చేసామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. వారి నుంచి రూ.8వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకు న్నామన్నారు.ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

శ్రీనేతాజీ అధినేత శ్రీనివాసరావుకు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక శ్రీనేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అధినేత తమ్మ శ్రీనివాసరావు పితృవియోగం కలిగింది. శ్రీనివాసరావును పలువురు గురువారం పరామర్శిం చారు. ఈనెల 15న శ్రీనివాస రావు తండ్రి తమ్మ సత్యనారాయణ(75) గుండెపోటుతో మరణించారు. స్కూల్ డైరెక్టర్ తమ్మ శ్రీనివాసరావు గురువారం విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి సత్యనారాయణ మూలస్థాన అగ్రహారంలో ఉంటూ విద్యాదానం చేసిన సేవలు, నిర్విరామ కృషి, సమాజానికి అందించిన మార్గదర్శనం మాకు స్ఫూర్తిగా నిలిచిపోతున్నాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సత్యనారాయణ కుటుంబ సభ్యులకు తెలియజేశారు.


సత్యనారాయణ(ఫైల్)

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు ముమ్మిడివరం అగ్నిమాపక అధికారి తెలిపింది. ఈ మేరకు సహాయ అగ్నిమాపక అధికారి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజేలంక పంచాయతీ పరిధి శివారు బలుసుల్లంక గ్రామానికి చెందిన చిన్నం ప్రసాద్ ఇంట్లో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ఓ తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది మటన స్థలికి చేరుకొని మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తీసుకువచ్చారు. వ్యవసాయ కూలీలైన ప్రసాద్, అతని భార్య పనులకు వెళ్లగా, భవన నిర్మాణ కార్మికులైన కుమారులు ఇద్దరూ తాపీ పనులకు వెళ్లారు. మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి సర్వం దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. స్థానిక యువకులు, అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో. భారీ ప్రమాదం తప్పింది.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి


ప్రజాశక్తి - ఆలమూరు

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, టిడిపి నియోజకవర్గ యువ నేత బండారు సంజీవ్ అన్నారు. చెముడులంక ఎస్సీ పేటలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలమూరు బిసి సెల్ అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, కూటమి నాయకులు జంపోలు వెంకట్రావు, ఆకుల అన్నవరం, బల్ల హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ బెస్త వీధిలో గత వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. వేసవికాలంలో మంచి నీరు అవసరాలు పెరగడం తో ప్రజలు విపరీతంగా తాగునీరు ఉపయోగిస్తారు. అయితే గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించు కోవడం లేదు. దీంతో ఎంతో నీరు వృథాగా నేలపాలవుతోంది. కనీసం ట్యాంక్ వాచర్ కూడా పట్టించుకోవడం లేదని తక్షణం గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి నీరు వృథా కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నియోజకవర్గం మైనార్టీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గత వారం నుంచి దీన్ని గమనించకపోవడంతో రాత్రి, పగలు నీరు వృథా అవుతుండని వెంటనే పంచాయతీ సిబ్బంది స్పెషల్ వీధిలో ట్యాప్ వేసి తాగునీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మత్స్యకారులకాలనీ లో వృథాగాపోతున్న తాగునీరు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - మండపేట

వైసిపి బలోపేతానికి కలిసి పనిచేద్దామని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. ఇటీవల వైసిపి జిల్లా అధ్యక్షునిగా చిర్ల జగ్గిరెడ్డిని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. జగ్గిరెడ్డి గురువారం మండపేటలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధి కోసం పిసిసి సభ్యులు తోట త్రిమూర్తులు వంటి సీనియర్ నాయకుల సలహాలు, ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని పనిచేస్తానని జగ్గిరెడ్డి తెలిపారు. పిసిసి సభ్యునిగా ఎంపికైన త్రిమూర్తులును ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్ష హోదాలో మండపేట చేరుకున్న జగ్గిరెడ్డికి ఎమ్మెల్సీ తోట మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, రెడ్డి రాజబాబు, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, టౌన్ ప్రెసిడెంట్ ముమ్మిడివరపు బాపిరాజు, జడ్‌పిటిసి సభ్యులు పుట్టపూడి అబ్బు, ఎంపిపిలు ఉండమట్ల వాసు, నౌడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

బాల బాలాజీ దేవస్థానం లో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు అప్పనపల్లికి చెందిన పోలిరాజు రామ మోహనరావు,రామ రాజేశ్వరి దేవి గురువారం రూ.1,0,011లు విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. దాతలు వారి కుటుంబ సభ్యులు ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారని తెలిపారు.. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - రావులపాలెం

జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూరాలని కొత్తపేట నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, స్థానికులతో కలిసి గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక కళా వెంకట్రావు సెంటర్ నుంచి జాతీయ రహదారి, రింగ్ రోడ్డు మీదుగా శాంతి ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వన్నెచింతలపూడి గ్రామ పరిధిలోని ముంగండవారిపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం పరసా సూర్యకుమారి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి. డివైఇఒ గుబ్బల సూర్యప్రకాశం ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాలు తిలకించారు.

విద్యార్థినికి పలువురి అభినందన

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలో పదవ తరగతిలో పరీక్ష ఫలితాల్లో 597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 4 వ ర్యాంక్, కోనసీమ జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ స్థానిక శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి తురగా మధు చంద్రిక సాధించింది. విద్యార్థిని తల్లిదండ్రులు విజయలక్ష్మి, కుమార్ రామ్ లను గురువారం పట్టణంలోని వారి నివాసముంలో అభినందించి మధు చంద్రిక కు ప్రోత్సాహక నగదు బహుమతిని శాసనమండలి మాజీ సభ్యులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు అందజేశారు .ఈ కార్యక్రమంలో కొత్తూరు శ్రీనివాస్, జిల్లెల్ల గోపాల్, చిన్ని పవన్, శివ, అద్దంకి భాస్కర్, ఇంద్రజిత్తు పాల్గొన్నారు. అమలాపురం స్థానిక కామన గరువు ఆదిత్య పాఠశాల విద్యార్థి వంక జోషిక 591 సాధించినట్లు తల్లి తండ్రులు వంక బుల్లేశ్వరరావు, విజయ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

పది ఫలితాల్లో సిద్ధార్థ విజయభేరి

ప్రజాశక్తి - ఆలమూరు

టెన్త్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతతో విజయభేరి మోగించిందని స్కూల్ అధినేత కె.ముల్లారావు గురువారం తెలిపారు. ఇందులో మండల ప్రథమ స్థానం ఎస్.కల్కి భావన-590, ద్వితీయ స్థానం పి.పద్మావతి-588 మార్కులతో సాధించారు. అలాగే మండలంలో నాల్గవ స్థానంలో బి.సుజిత -585, ఎస్ఎస్.సత్య శశి- 585 మార్కులతో దక్కించుకున్నారు. అలాగే 550 పైగా మార్కులు సాధించిన వారు 60 మంది, 500 పైగా మార్కులు సాధించిన వారు 138 మంది విద్యార్థులు ఉన్నారని ఆయన తెలిపారు. దీంతో ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు శ్రీ కొర్లపాటి డైరెక్టర్ ముల్లారావు అభినందనలు తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులను అభినందించి ఆయన సత్కరించారు.

అంబాజీపేట మండలంలో 99 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండల పరిధిలో 398 మంది టెన్త్ పరీక్షలు రాయగా 369 మంది ఉత్తీర్ణులై 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారులు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ లు గురువారం తెలిపారు. మండల పరిధిలో 9 హైస్కూల్ లకు గాను చిరతపూడి, కె.పెదపూడి హైస్కూల్ లు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నుండి గంగలకుర్రు హైస్కూల్ నుంచి గాడ తైలజా అన్నపూర్ణ 589, తొండవరం హైస్కూల్ నుంచి కేతా వీర దుర్గ భాను 584, అంబాజీపేట హైస్కూల్ నుంచి మానుకొండ దరహాస్ 578 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు గా నిలిచారన్నారు. మండల స్థాయి విజేతలను ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యులు బూడిద వరలక్ష్మి, ఎంఇఒ లు ఆయా హైస్కూల్ హెచ్ఎం లు,ఉపాధ్యాయులు అభినందించారు.

పదిలో గోడి గురుకుల పాఠశాల సత్తా

ప్రజాశక్తి - అల్లవరం

ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో గోడి బాలికల పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించి సత్తా చాటారని పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కిరణ్మయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో 600 మార్కులకు తొత్తరమూడి కీర్తన 546 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానం , కొరుకొండ కల్యాణ 524 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, రొక్కాల ఇన్సి 521 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారన్నారు . ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోడి గురుకుల బాలికల పాఠశాల ఉత్తీర్ణత శాతంలో ప్రథమ స్థానంలో సాధించిందని ప్రిన్సిపల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ ఎస్ కిరణ్మయి తదితరులు అభినందించారు.

26లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రయివేట్ యాజమాన్య పాఠశాలలన్నీ విద్యాహక్కు చట్టంలో 12(1) సి సెక్షన్ ప్రకారం తమ పాఠశాలల రిజిస్ట్రేషన్లను ఈనెల 26 వ తేదీకి పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారులు వర్ధనపాడ్, పాచ్చ సాహెల్లు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే సమాచారం ఏర్పాటచేసి, అన్ని పాఠశాలలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 25 శాతం ఒకటవ తరగతికి ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం జిఒ విడుదల చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలకు ఈనెల 28 నుంచి మే నెల 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ప్రాథమిక వివరాలతో http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయింపు

ప్రజాశక్తి - కొత్తపేట

వచ్చే విద్యాసంవత్సరానికి ప్రయివేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థుల కు 25 శాతం సీట్లు కేటాయించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీని ప్రకారం వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి లో తమ పిల్లలు ప్రవేశం పొందేందుకు తల్లిదండ్రులు ఈ నెల 28 నుంచి మే 15 వరకు cse.ap.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసు కోవాలని ఎంఇఒ ఎం.హరి ప్రసాద్ తెలిపారు.

సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తులు అందజేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తుల అందజేసి వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానం చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజబాబు అన్నారు. గురువారం వారి ఆధ్వర్యంలో కొత్తూరులో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం నిర్వహించారు.

మే 10న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మే 10వ తేదిన జరిగే నేషనల్ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం.హరినారాయణ కోరారు. గురువారం ఆ మండల న్యాయ సేవా అధికార సంస్థ ఎంఎల్‌సి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దావాల్లో వివాదాలు పెరిగిపోయాయని, రాజీ చేయదగ్గ కేసుల్లో రాజీపడడం వల్ల సమయం, ఆదాయం కూడా ఆదా పుతుందని రాజీమార్గమే రాజమార్గమని ఆయన అన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, ఆర్డిఒ డి.అఖిల, డిఎస్‌పి బి.రఘువీర్ ఎంఎల్‌ఎ ఎసిసి సభ్యులు బొడ్డపాటి సురేష్ కుమార్, పివిఎస్.జానకి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట విద్యార్థినికి ఎంఎల్‌ఎ అభినందన

ప్రజాశక్తి - కొత్తపేట

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలలో 587 మార్కులతో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కొత్తపేట విద్యార్థిని షయ్యద్ రషీద్ బేగం ప్రథమ స్థానం నిలిచింది. ఈ సందర్భంగా గురువారం విద్యార్థినిని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ.ఎం.హరిప్రసాద్, కె.లీలావతిలు విద్యా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్ గ్రామ ఉపసర్పంచ్, విళ్ల మారుతి ప్రసాద్ , గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని రషీద్ బేగంను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ తదితరులు

వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 ఆర్ ఉదయ భాస్కర్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి హనుమంత రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పక్షం రోజులు జరిగే ప్రత్యేక శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు.

కొత్తపేటలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

కొత్తపేట: మండలంలో జడ్పి బాలికోన్నత పాఠశాల నందు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను మండల విద్యాశాఖాధికారులు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి ప్రారంభించారని జడ్‌పి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. సత్యనారాయణ తెలియజేశారు.

వాటర్ ప్లాంట్లను ప్రారంభించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయం నందు రూ.5 లక్షల వ్యయంతో ఒఎన్‌జిసి వారు ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను, బి.దొడ్డవరం గ్రామపంచాయతీ ఆవాస ప్రాంతంలో జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను, పెదపట్నంలంక ఆవాస ప్రాంతంలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన రూ.20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులను పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు గడ్డం మంగాలక్ష్మి, చెల్లి బోయిన శివరామ సుబ్రహ్మణ్యం, సుందరనీడి రాజేష్ కుమార్, ఎంపీటీసీలు వాసంశెట్టి వెంకటరమణ,కొమ్ములంగంమయ్య, మండల టిడిపి అధ్యక్షుడు ముళ్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.